క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

సాలూరు: మెప్మా సీఎంఎం పుష్ప ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించిన మహిళలకు మెప్మా సిబ్బంది బహుమతులు అందజేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ రాజారావు

సాలూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కె. రాజారావు అన్నారు. ఈఈ దక్షిణామూర్తితో కలిసి పట్టణంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటిలో తాగునీటి సరఫరా ప్రస్తుత పరిస్థితి, వేసవిలో తీసుకునే చర్యలపై ఆరా తీశారు. అనంతరం గుమడాంలోని ఐదో హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా ఇంటర్నల్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈ సూరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు వింటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

సాలూరు: విద్యుత్ వినియోగదారులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎలక్ట్రికల్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి జిల్లేల సీతారాం, ఏడీఈ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్ ఇన్‌చీఫ్ శ్రీనివాసరావు

సాలూరు: మండలంలోని చీపురువలసలో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాలను ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీసీడీపీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.కార్యక్రమంలో ఈఈ శాంతేశ్వరరావు, ఏఈఈ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



సాలూరు: పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, మండల కన్వీనర్ క్లోపల్లి త్రినాథ, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణం, మండలంలో వేర్వేరుగా ప్రచారం చేపట్టి, సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

20 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని నడిమిబుడగరాయి పరిసరాల్లో పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. సవర సోమేశ్వరరావు అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల సారా పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠరావు తెలిపారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సీతంరాజును ఆశీర్వదించండి



బలిజిపేట: అరసాడలో ఎమ్మెల్సీ ప్రచారం చేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



సీతానగరం: ఓటు వేయాలని నమూనా పత్రాన్ని అందజేస్తున్న మండలకమిటీ నాయకులు

బలిజిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న సీతంరాజు సుధాకర్‌ను ఆశీర్వదించి గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు మండలంలోని అరసాడలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.గౌరీశంకర్, జి.రాజు, పి.చాకరాపల్లి సర్పంచ్ కె.మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యం ఓటు వేయండి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను ఆశీర్వదించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు పట్టభద్రులను కోరారు. ఈ మేరకు మండలంలోని పణుకువలస, అరసాడలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ సాయిరాం, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, పి.రామకృష్ణ, కె.పాపినాయుడు, జగన్, టి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో ప్రచారం

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి,వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ బుడ్డిపేటలో ప్రచారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు, మండల కమిటీ సభ్యులు యు.సురేష్, రమేష్‌ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్వీ కిశోర్, ఎం వెంకటరమణ, పి ప్రసాద్, గంగులు పాల్గొన్నారు.



బలిజిపేట: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికపై ప్రచార సమావేశం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నియోజకవర్గ పరిధిలో గల 9 పోలింగ్ కేంద్రాల పరిధిలోని 90 మంది పీఓసీలు, కన్వీనర్లు, నాయకులతో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజుతో పాటు ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొననున్న సమావేశం విజయవంతం చేసేందుకు గూడ్స్‌షెడ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి సంబంధించి మనందరినీ దిశానిర్దేశం చేయనున్న మంత్రి సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం పురపాలక సంఘం, మండలం ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో..

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ సీతంరాజు సుధాకర్‌ను ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మంగళవారం పురపాలక సంఘంలోని గాంధీనగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కె.రుక్మిణి, మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై జాగ్రత్తలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని ప్రతి ఒక్కరూ ఓటరు ఐడీకి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ప్రజలకు తెలియజేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో బీఎల్వోలు, వీఆర్వోలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఆధార్ అనుసంధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ నెల13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లకు స్లిప్పులు ఏమేరకు పంపిణీ చేశారు? పోలింగ్ కేంద్రంలో వనరుల కల్పన ఏవిధంగా ఉందో, శాంతిభద్రతలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లందరికీ ఓటు స్లిప్పులు అందివ్వాలని, వారినుంచి తిరుగు రశీదు పొందాలని బీఎల్వోలకు సూచించారు. ఈ నెల 10 తేదీలోగా ఓటరు ఐడీకి ఆధార్ అనుసంధానం విధిగా చేయించి బీఎల్వోలకు సహకరించాలని పట్టభద్ర ఓటర్లను కోరాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



పార్వతీపురంలో హోలీ సంబరాల్లో యువత

పార్వతీపురం టౌన్: ప్రజలందరి జీవితాల్లో హోలీ సంబరాలు వెలుగులు నింపాలని కోరుకుంటూ పట్టణ ప్రజలు మంగళవారం వేడుక నిర్వహించుకున్నారు. కుల మత భేదాలు లేకుండా రంగులు పూసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించి వేడుకలో పాల్గొన్నారు.

ఘనంగా చిన్నమ్మవారి జాతర



సిరిమానుపై పూజారి

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామంలో చిన్నమ్మతల్లి సిరిమానోత్సవం మంగళవారం అంగరవంగ వైభవంగా జరిగింది. సిరిమానుపై పూజారి అధిష్టించి గ్రామమంతా తిరిగారు. అలాగే దయానిధిపురంలో కూడా అమ్మవారి ఉత్సవం జరిగింది.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి

పాలకొండ రూరల్: సచివాలయ స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారంపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పనుకువలస సచివాలయాన్ని ఈఓపీఆర్డీ సత్యంతో కలిసి మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బట్వాడా, అర్హుల జాబితాల ప్రదర్శన, స్పందన వినతుల పరిష్కారంపై ఆరా తీశారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వీపీరాజుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రాక్టికల్ పరీక్షలు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని పార్వతీపురం మన్యం జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజుల వీణ అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి జరగనున్న థియరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్‌గాడ్జెట్‌లను తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సిబ్బంది గానీ విద్యార్థులు గానీ మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్‌కు బోర్డు వారే ఒక బేసిక్ ఫోన్ ఇస్తారని, అత్యవసర సమయాల్లో మాత్రమే ఆ ఫోన్ వినియోగించేలా బోర్డు నిబంధనలను జారీ చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. హాల్ టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరి అన్నారు. విద్యార్థులంతా ఆయా కళాశాలల్లోనే హాల్‌టికెట్లు పొందాలని స్పష్టం చేశారు.

ప్రపంచానికి తెలిసిన రాష్ట్ర సత్తా

- గ్లోబల్ సమ్మిట్ ద్వారా వనరులు, అవకాశాల పరిచయం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- జిల్లా కేంద్రంలో విజయోత్సవ సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు. పార్టీశ్రేణులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఏపీ రాష్ట్ర సత్తా ప్రపంచానికి చాటిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. దేశంలోనే అత్యధిక వనరులున్న నగరంగా విశాఖ నిలుస్తుందన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టాప్ పారిశ్రామిక దిగ్గజాలతో రాష్ట్ర ప్రభుత్వం 352 ఒప్పందాలతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం సీఎం జగన్ దార్శనికతకు నిదర్శనమన్నారు. ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం నుంచి అందించే సహకారం, నైపుణ్యవంతమైన యువత అందుబాటు గురించి పారిశ్రామిక దిగ్గజాలకు గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ద్వారా ముఖ్యమంత్రి వివరించినట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ద్వారా సీఎం జగన్ బ్రాండ్ కనిపించిందని దేశమంతా విశాఖ సదస్సు గురించే మాట్లాడుకుంటోందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయం..ఆరోగ్యానికి రక్ష



వీరఘట్టం: చిదిమిలో అవగాహన ర్యాలీ

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయం మన ఆరోగ్యానికి రక్ష అని వ్యవసాయ అనుబంధకులు నినాదాలు చేశారు. మండలంలోని చిదిమి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందన్నారు. విత్తనాలను బీజామృతంతో శుద్ధిచేసి నాటుకోవడం వల్ల తెగుళ్ల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. ర్యాలీలో చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ మారుతీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: నవధాన్యాల సాగుపై శంబాంలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. మాస్టర్ ట్రైనర్ మహేష్ మాట్లాడుతూ ప్రతీ రైతు నవధాన్యాలను సాగు చేయాలన్నారు. దీని వలన పొలంలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని, తద్వారా పంటలకు ఎటువంటి రసాయిన ఎరువులు వాడాల్సిన అవసరం రాదన్నారు. కార్యక్రమంలో యాంకర్ బి.నరేష్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకా



మురగడాంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి గణేష్

బలిజిపేట: మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో మురగడాం గ్రామంలో 250పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు మంగళవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలిగిత్తల మధ్య పుళ్లు వంటివి కనిపిస్తే పశువులకు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన ప్రకారం ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలి కుంటు నిరోధక టీకాపై అవగాహన

పార్వతీపురంటౌన్: పట్టణంలోని 18 వ వార్డు బూరాడ వీధిలో ఏరియా ప్రాంతీయ పశు వైద్యశాల పార్వతీపురం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు నాలుగు మాసాల దూడ నుంచి పైబడిన అన్ని రకాల పశువులకు వేయాల్సిన టీకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బోను ఆదినారాయణ, సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ ఆర్.పద్మావతి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యసేవలు

- పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమల ప్రసాద్



నర్సిపురంలో వైద్యరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో ఇళ్ల వద్దనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమలప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురం గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 15రోజులకొకసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

కేఎస్‌పురంలో తీరనున్న తాగునీటి కష్టాలు

సీతానగరం:

మండలంలోని కోటసీతారాంపురంలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు తీరనున్నాయి. గ్రామంలో రూ.16 లక్షల జేజేఎం నిధులతో నిర్మించిన ఇంటింటి కుళాయి పనులు పూర్తి కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ మంగళవారం ట్రయల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వజల ధార పథకంలో భాగంగా వాటర్‌ట్యాంక్ నిర్మించి గ్రామం వరకూ ప్రధానపైప్‌లైన్ వేయడంతో గ్రామంలో 350 ఇంటింటి కుళాయిల ఏర్పాటు పూర్తయినట్లు చెప్పారు. దీంతో గ్రామస్తుల తాగునీటి కష్టాలు తీరనున్నాయని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంచినీటి పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.



ట్రయల్‌గా నీరు విడుదల చేస్తున్న ఏఈ పవన్‌కుమార్

2కోట్ల పనిదినాల కల్పనే లక్ష్యం

- డ్వామా పీడీ రామచంద్రరావు

పాలకొండ రూరల్: ఉపాధిహామీ పథకం లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పాలకొండ, వీరఘట్టం మండలాల ఉపాధి సిబ్బంది, క్షేత్ర సహాయకులతో మంగళవారం సమీక్ష చేపట్టారు. పంచాయతీల వారిగా 2022-23లో చేపట్టిన పనులు, పెండింగ్ పనులపై ఆరాతీశారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే 2023-24 ఏడాదికి సంబంధించి చేపడుతున్న పనుల విషయంలో సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. వేతనదారుల ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలన్నారు. సగటు వేతనం రూ.257 వచ్చేలా, వలసలు నివారించేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాజా ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలంలో దాదాపు 12 వందలకు పైచిలుకు పనులు జరిగేలా చూస్తామన్నారు. 15 మండలాల్లో రమారమి 22,286 పనులు గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేతనదారులకు రెండు కోట్ల పనిదినాలు కల్పించటమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆయనతో పాటు ఏపీడీ శ్రీహరి తదితరులున్నారు.